# ఏజెన్సీ భూమి సమస్య

# పోలీసు చర్యలొద్దు - పరిష్కారం కావాలి

పశ్చిమగోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంత భూమి సమస్యకు "పోలీసు పరిష్కారమే" జవాబు అని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుందా?

ఎల్‌టిఆర్ చట్టాన్ని న్యాయబద్ధంగా అమలు చేయాలని ఆదివాసులు కోరుకుంటున్నారు. ఊరికే కోరుకుంటే, సమస్య తీరదు కాబట్టి, వివాదాస్పదమైనవిగా తాము భావిస్తున్న భూములను, సమస్య పరిష్కారమయ్యే దాకా గిరిజనేతరులు అనుభవించడానికి వీలులేదని అడ్డం పడుతున్నారు.

కొన్ని చోట్ల ఆ భూములను ఆదివాసులే అనుభవిస్తున్నారు. కొన్ని చోట్ల అవి బీడుపడి ఉన్నాయి. కొన్నిచోట్ల గిరిజనేతరులు ఎట్లాగైనా ఆ భూముల నుండి ఫలాన్ని తామే తీసుకోవాలని ప్రయత్నం చేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరుగుతున్నది.

పైకి ఇది శాంతిభద్రతల సమస్యగా కనిపించినప్పటికీ దీనికి జవాబు నేరస్మృతిలో లేదనీ, వివాదగ్రస్తం అయిన భూముల విషయంలో సమగ్రమైన విచారణ జరిపి అవి ఎవరికి చెందుతాయో నిర్ణయించడమే శాంతికి మార్గమనీ అయిదేళ్ళుగా ప్రజాతంత్ర శక్తులన్నీ అంటున్నాయి.

అధికార యంత్రాంగం అప్పుడప్పుడు ఈ విషయాన్ని అర్థం చేసుకున్నట్లే కనిపిస్తుంది. అప్పుడప్పుడు ఆదివాసులను తన్ని పరిష్కరించటమే మార్గమన్నట్లు ప్రవర్తిస్తుంది.

ప్రస్తుతం రెండవదశ నడుస్తున్నది. వివాదం లేవదీసిన ప్రతీ గూడెంపైనా పోలీసులు కేసులు పెట్టారు. పాత ఘటనలు కూడా తవ్వితీసి అరెస్టు చేస్తున్నారు. ఇప్పటికే 70మందికి పైగా జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం మండలాల్లో అరెస్టయిన వారిలో సిపిఐ(ఎం), శక్తి సంస్థల కార్యకర్తలున్నారు. సాధారణ ఆదివాసీ ప్రజలున్నారు. ఒక్కొక్కరి మీద 5 నుండి 10 దాకా కేసులు పెట్టి, ప్రతీ ఘర్షణను హత్యాప్రయత్నం (సెక్షన్ 307 ఐపిసి) గా చూపించి ఇప్పట్లో బయటకు రాలేని పరిస్థితి కల్పిస్తున్నారు.

ఇప్పటికి 13 కేసులలో అరెస్టులు జరిగాయి. ఇంకా వందలకేసులున్నాయి. అని పోలీసులు అంటున్నారు. ఒక్కొక్క కేసులోనూ ముద్దాయిల సంఖ్య అనిశ్చితం. కొందరిపేర్లు రాసి 'మరి నాలుగువందలమంది' అనీ 'మరి రెండువందల యాభైమంది' అనీ లేకపోతే 'మరి కొంతమంది' అనీ రాస్తున్నారు.

ఈ వందలలో ఎవరున్నారో ఎవరు లేరో ప్రజలకు తెలియదు కాబట్టి మొత్తంగా ఆదివాసులంతా బిక్కుబిక్కుమంటూ గూడెంలో బతికే స్థితి ఏర్పడింది. గూడెం నుండి బయటకు పోయిన ఆదివాసులెవ్వరినైనా పోలీసులు అరెస్టు చేయొచ్చు. చేస్తామని బహిరంగంగానే బెదిరిస్తున్నారు కూడా. అరెస్టు చేసినవారిని ఎన్నికేసులలోనైనా ఇరికిస్తారు. శిక్ష పడకుండానే ఒక సంవత్సరం రిమాండులో ఉంచగలరు.

మండల కేంద్రంలో దుకాణాల దగ్గర, ప్రభుత్వ కార్యాలయాల దగ్గర, ఆసుపత్రుల దగ్గర, సంతల దగ్గర పోలీసులు కాపలా చేస్తున్నారు. బస్సులు సోదా చేస్తున్నారు. భూవివాదాలున్నా గ్రామాలకు చెందిన గిరిజనేతరులు చూపించిన ఆదివాసులను పట్టుకుపోయి అరెస్టు చేస్తున్నారు. దర్భగూడెంవంటి గ్రామాలలోనైతే గిరిజనేతరులే పోలీసులుగా వ్యవహరిస్తూ తమ ఊరిలోకి ప్రవేశించిన ఆదివాసులను పట్టుకొని కట్టేసి కొట్టి పోలీసులకు అప్పగిస్తున్నారు.

దీనికి తోడు చంపడమే పోలీసు డ్యూటీ అని భావించే ఆంజనేయస్వామి అనే అధికారిని బుట్టాయిగూడెం ఎస్‌ఐగా నియమించారు. తెలంగాణా జిల్లాలకు వెలుపల ఇతనితో సమానంగా "ఎన్‌కౌంటర్" చేసిన పోలీసు అధికారి ఎవ్వరూ లేరు. చాలా సున్నితమైన సాంఘిక సమస్య ఉన్న బుట్టాయిగూడెం వంటి ప్రాంతంలో ఇటువంటి పోలీస్ అధికారిని నియమించడమే తప్పు. అయితే ఇది యాధృచ్ఛికంగా జరిగిన తప్పు కాదు. భూమి సమస్యలను ఓర్పుగా పరిష్కరించే నైపుణ్యం గల రెవెన్యూ అధికారిని అక్కడ నియమించాలన్న ఆలోచన ఎన్నడూ రాని ప్రభుత్వానికి ఆంజనేయస్వామి వంటి పోలీస్ అధికారిని నియమించాలన్న ఆలోచన వచ్చిందంటే దాని వెనుకున్న ఉద్దేశ్యం స్పష్టమే.

అతను ఆదివాసీ గ్రామాల మీద పడి 'కోయ లంజ', కోయ లంజాకొడక' అంటూ అసభ్యకరమైన తిట్లు తిడుతున్నాడు. 'ఎన్‌కౌంటర్' చేస్తానని బెదిరిస్తున్నాడు. అరెస్టు చేసిన వారి మెడమీద కత్తిపెట్టి వారి విశ్వాసాలకు వ్యతిరేకంగా వారి చేతనే ప్రకటనలు ఇప్పిస్తున్నారు.

అయిదేళ్లగా పశ్చిమగోదావరి ఏజెన్సీలో జరుగుతున్న ఘర్షణలకు శాశ్వతమైన పరిష్కారం దొరకాలంటే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు

తమ కార్యాలయాలలో కూర్చొని చేసే విచారణలు సరిపోవని, అధికారులే మొత్తం రికార్డు తీసుకొని గ్రామంలో అన్ని వర్గాల ప్రజల సమక్షంలో కూర్చొని రికార్డు పరిశీలన బహిరంగంగా సమగ్రంగా జరపాలనీ ప్రజాతంత్ర వాదులు తొలినాటి నుండి అంటున్న విషయాన్ని ప్రభుత్వం కూడా అంగీకరించి రేండేళ్లనాడు ఒక సర్క్యులర్ కూడా జారీ చేసింది. హై కోర్టుకు కూడా ఆ సర్క్యులర్‌ను సమర్పించి 'దీనిని అమలు చేయా'అన్న ఆర్డరు తీసుకొంది. కానీ దానిని ఒట్టి రెండు గ్రామాలలో అరకొరగా అమలు చేసి దాని సంగతి మరిచిపోయింది. ఆ మరపు సహజంగారాలేదు. అది అమలయితే తమ ఆస్తుల చాలా కోల్పోవలసి వస్తుందని భయపడుతున్న గిరిజనేతరుల ఒత్తిడి వల్ల వచ్చింది. ఆ మార్గాన్ని వదిలిపెట్టి ఇప్పుడు లాఠీలతోనూ క్రిమినల్ కేసులతోనూ ఆదివాసులను అణచివేసి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. దీని ఫలితం ఈ రోజు ఏజెన్సీలో చూస్తున్నాం. ఆదివాసులలో ఇంత భయం గత 5 సంవత్సరాలలో ఎన్నడూలేదు. అనారోగ్యం పీకల మీదికొచ్చినా ఆస్పత్రికి పోకుండా, సొంత బంధువుల అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న వారిని చూడడానికి పోకుండా, ఐటిడిఎ వల్ల వచ్చే స్వల్పమైన ప్రయోజనాలు పొందడానికి కె.ఆర్.పురం పోకుండా ఇళ్లలోనే బిక్కుబిక్కుమంటూ బ్రతుకుతున్నారు.

ఈ అణిచివేత అన్యాయమని పోలీసు అధికారులతో అంటే చాలా 'చట్టబద్ధంగా' కనిపించే జవాబు చెప్తున్నారు. 'గిరిజనేతరుల పట్టా భూముల మీదికి పోతే కేసుల పెట్టక తప్పదు కదా. పోవద్దు అంటున్నారు. వారికి అర్థం కాని విషయం - అర్థం చేసుకొవటానికి సిద్ధంగా లేని విషయం ఏమిటంటే యేది పట్టాభూమి అనేది ఏజెన్సీలోని వివాదం. గిరిజనేతరులు పట్టాలు సునాయాసంగా పుట్టించగలుగుతున్నారనేదే అభియోగం. ఆ పట్టాలపైన సమగ్రమైన విచారణ జరపాలనేదే ఆదివాసీల డిమాండ్. ఇదేమి గుర్తించకుండా 'పట్టా భూముల మీదికి పోతే కేసులు పెడతాం' అనడంలో అర్థంలేదు.

ఏజెన్సీ భూమి సమస్యను త్వరగా, న్యాయంగా పరిష్కరించడం అవసరం. ఒక సబ్ కలెక్టర్ ర్యాంకు అధికారిని దీని కోసం ప్రత్యేకంగా నియమించి వివాదం వున్న గ్రామాలలో బహిరంగంగా రికార్డు చదివి ఒకొక్క సర్వే నంబరు భూమి సంగతి ప్రజలందరి సమక్షంలో నిర్ధారించాలి. రెడ్డిగణపవరంలో ఈ ప్రక్రియ దాదాపు 90% జరిగింది. ఇరువర్గాల్లో అది జరిగినమేరకు న్యాయంగా జరిగిందని ఒప్పుకుంటున్నారు. ఇతర గ్రామాల గిరిజనేతరల ఒత్తిడి వల్ల ఆగిపోయిన ఈ ప్రక్రియను పునరుద్ధరించాలి, పోలీసు నిర్బంధాన్ని ఆపాలి.

భూమి సమస్య చట్టపరిభాషలో సివిల్ తగాదా. 'పట్టా భూముల మీదికి పోతున్నారు' అనే పేరు మీద ప్రతి సివిల్ తగాదాను క్రిమినల్ కేసుగా మార్చకుండా, నిజంగా హింసాత్మక రూపం తీసుకున్న ఘటనలకే పోలీసు చర్యలు పరిమితం కావాలి. అదికూడా చట్టానికి ప్రజల హక్కులకు లోబడి జరగాలి. టి.నర్సాపురం మండలంలోని గిరిజన గ్రామాలను ఏజెన్సీలో కలిపి 1/70 అమలుపరచాలి.

ఈ డిమాండ్లతో ప్రజాతంత్ర శక్తులు ఉద్యమించాలని పిలుపునిస్తూ ఈ నెల 5వ తేదీన చింతలపూడిలో మానవహక్కుల వేదిక నిర్వహిస్తున్న సదస్సుకు అందరూ హాజరు కావల్సిందిగా ఆహ్వానిస్తున్నాం.

స్థలము : చింతలపూడి శివాలయంలో      తేది : 5-10-2000      సమయం : మధ్యాహ్నం 2 గంటలకు

ముఖ్యఅతిథి : డా॥ కె. బాలగోపాల్, మానవ హక్కుల వేదిక రాష్ట్రకమిటి సభ్యులు

వక్తలు : శ్రీ ఎన్. జీవన్ కుమార్, రాష్ట్ర కన్వీనర్, మానవ హక్కుల వేదిక
శ్రీ జి. లక్ష్మి నారాయణ, దళిత మహాసభ జిల్లా నాయకులు
శ్రీ కె. చంద్రశేఖర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు
శ్రీ షేక్ కాలేషా, వ్యవసాయ కార్మిక సంఘం
శ్రీ జి. వి. రాఘవులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, రైతుకూలీసంఘం
శ్రీ బి. ఆశీర్వాదం, రాష్ట్ర నాయకులు, ఎస్.సి.ఎస్.టి., హక్కుల పరిరక్షణ కమిటి

సభాధ్యక్షులు : శ్రీ ఎలికే రాజేంద్రప్రసాద్, జిల్లా నాయకులు, మానవ హక్కుల వేదిక

ఇట్లు
**మానవ హక్కుల వేదిక**
పశ్చిమగోదావరి

2-10-2000

eluru printers 33543

ప్రచురణకర్త : ఎలికే రాజేంద్రప్రసాద్, చింతలపూడి